క్లుప్తంగా

వెలంపల్లి కార్యాలయం వద్ద సంక్రాంతి సందడి



భోగిమంటలు వెలిగిసుస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి వేడుకల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో సందడి చేశారు. భోగి మంటలతో వేడుకలను ప్రారంభించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పందెం కోళ్లతో హడావుడి చేశారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి వేడుకలను ప్రారంభించటంతో జానపద కళాకారులు సైతం సందడి చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సైతం కార్యాలయం ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా వెలంపల్లి ఇంట ఇటీవల వివాహాలు జరగటంతో కొత్త అల్లుళ్లతో సందడి నెలకొంది

సాయినాథుడికి భోగి పండ్లతో అభిషేకం



సాయినాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పర్వదినాల్లో తొలి రోజు భోగి పండగ సందర్భంగా భవానీపురం ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో కొలువై ఉన్న సాయినాథుడికి భక్తులతో పూలు, భోగి పండ్లతో అభిషేకం చేయించారు. అనంతరం ఆ భోగిపండ్లను చిన్నారులపై పోసి ఆశీర్వదించారు. చిన్నారులకు దాతలు సమకూర్చిన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, యెనిగళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రెడ్డయ్య సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లాకు మాజీ ఎంపీ కొలుసు రెడ్డయ్య సేవలు అపూర్వమని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, ఆల్ ఇండియా యాదవ మహాసభ అధ్యక్షుడిగా ఆయన విశేష సేవలందించారని తెలిపారు. రెడ్డయ్య ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లా రాజకీయాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్ల కేసులో మరో ఇద్దరు అరెస్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డూప్లికేటు గాళ్లకు తమ ఆధార్ కార్డులిచ్చి నకిలీ రిజిస్ట్రేషన్లకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ రిజిస్ట్రేషన్ల కేసులో ఇప్పటివరకు మొత్తం ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని పెజ్జోనిపేటకు చెందిన దారా కన్నయ్య, ఒంటిపులి విజయ తమ పేరుతో ఉన్న ఆధార్‌కార్డులను డూప్లికేటు గాళ్లకు అందిస్తారు. వాటి ఆధారంగా వారు వేరేపేర్లతో ఆధార్ కార్డుల తయారు చేసి, నకిలీ రిజిస్ట్రేషన్లకు వాడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో వారి పాత్ర నిర్ధారణ కావడంతో వారిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరికొందరి పాత్ర ఉందని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్రాంతి ముందు స్పెషల్ డ్యూటీ ఇష్టపడి చేసిన ప్రతి ఉద్యోగిని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆటోనగర్ డిపో ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎండీ సందేశాన్ని డిపో డీఎం ప్రవీణ్‌కుమార్ ఉద్యోగులకు చదివి వినిపించారు. అదేవిధంగా సంక్రాంతి అనంతరం నాలుగు రోజులు కూడా సిబ్బంది అంకితభావంతో పని చేసి, ఆర్టీసీ ఆదాయానికి కృషిచేయాలని ఆ సందేశంలో ఎండీ పేర్కొన్నారు.

సంక్రాంతి శోభ



నగరంలో హరిదాసుల సందడి



పాతబస్తీలో ఎమ్మెల్యే వెలంపల్లి ఇంటి వద్ద గంగిరెద్దుల విన్యాసాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ సాక్షత్కరిస్తోంది. సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ నగరవాసులు పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భోగి పండగతో ప్రారంభమయ్యే సంక్రాంతి వేడుకలు తొలి రోజు అంబరాన్ని తాకాయి. వేడుకల్లో భాగంగా హరిదాసుల హరినామ సంకీర్తనలతో ఇంటింటికీ వెళ్లి ఆశీస్సులందించారు. బసవన్నలతో గంగిరెద్దుల ఆటగాళ్లు సందడి చేస్తూ పండగ శోభను మరింత ద్విగిణీకృతం చేస్తున్నారు. నగరంలోని ప్రతి ఇంటా వారివారి స్థాయిల్లో సంక్రాంతి వేడుకలను నిర్వహించుకునేందుకు నగర వాసులు సిద్ధమవుతున్నారు. కరోనా మహమ్మారి వెళ్లిన తరువాత పూర్తిస్థాయిలో పండగను జరుపుకునేందుకు ప్రతిఒక్కరూ సమాయత్తమవుతున్నారు.

అంబరాన్ని తాకిన భోగి వేడుకలు

భోగి పండగను పురస్కరించుకుని నగరంలో శనివారం వేడుకలు అంబరాన్ని తాకాయి. నగరంలోని ప్రతి కూడలిలోనూ స్థానిక సంఘాలు, మిత్ర బృందాలు, అపార్ట్‌మెంట్ వాసులు, ఇళ్ల యజమానులు ఇలా ప్రతిఒక్కరూ భోగి మంటలు వేసి పూజలు చేశారు.

గొబ్బెమ్మలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం

సంక్రాంతి వేడుకల్లో భాగంగా ప్రతి ఇంట రంగవల్లులతో యువతులు కేరింతలు కొట్టారు. చక్కగా రంగవల్లులను తీర్చిదిద్ది గొబ్బెమ్మలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతున్నారు. అలాగే నగరంలోని వివిధ విద్యాసంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో శనివారం రంగవల్లుల పోటీలను నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

సంక్రాంతి వేడుకల్లో భాగంగా తొలి రోజు భోగి పండగను పురస్కరించుకుని ఆలయాలు కిటకిటలాయి. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకుని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగను పురస్కరించుకుని ఆలయాలను అంగరంగ వైభవంగా అలంకరించారు. విశేష అభిషేకాలను నిర్వహించారు. శనివారం సాయంత్రం గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దుర్గగుడిలోనూ సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. భోగిమంటలతో సందడి చేశారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం మర్రిచెట్టు సెంటర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు, బాలురకు స్లోసైక్లింగ్, రన్నింగ్, చెస్ పోటీలు, బాలికలకు రన్నింగ్, స్కిప్పింగ్, ఒప్పులకుప్ప, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహణ కమిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత, మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడాదీ సంక్రాంతికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ఈ నెల 17న జరుగబోయే కుండనాల భాస్కరరావు సంస్మరణ సభలో బహుమతులను అందజేస్తామని చెప్పారు.

పీఎస్‌సీఎంఆర్ కళాశాలలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన వివిధ రకాల పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు రంగవల్లులతో హడావుడి చేశారు. భోగి మంటలు వేసి పూజలు నిర్వహించారు. రంగవల్లులు, భోగి మంటల వద్ద విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు కళాశాల కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణలు బహుమతులను అందజేశారు.



కళాశాలలో రంగవల్లుల పోటీలు



నగరంలోని ఒక కళాశాలలో రంగవల్లుల అలంకరణ



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న శేషుమణి



బొమ్మల కొలువులు



యువతుల నృత్యహేల

కళకళలాడిన వైష్ణవాలయాలు



పాండురంగడికి చందనాలంకారం



న్యూజనరేషన్ యూనిట్ ఆధ్వర్యంలో భోగి మంటలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): భోగిపర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని పలు వైష్ణవాలయాలు శనివారం కళకళలాడాయి. ప్రధానంగా ధనుర్మాసోత్సవాలను భోగిపండగతో ముగింపు పలకడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆయా ఆలయాల్లో శనివారం గోదాదేవి రంగనాయకస్వామి వార్లకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను కన్నుల పండువుగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం, సైకం వారివీధిలోని శ్రీ సీతారామస్వామి వార్ల దేవస్థానం, సత్యనారాయణస్వామి దేవస్థానం, కొత్తగుళ్ల ప్రాంగణంలోని పాండురంగస్వామి ఆలయం, రామాలయం, భావనారాయణవీధిలోని కోదండరామస్వామి దేవస్థానం తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. ఈ సందర్భంగా ఆయా వైష్ణవాలయాలోని ఉత్సవమూర్తులకు ఉదయం నగరోత్సవం నిర్వహించారు.

సందడిగా భోగి మంటలు

భోగి పండగను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో భోగి మంటలతో స్థానికులు సందడి చేశారు. బ్రాహ్మణవీధి, గులాంమొహిద్దీన్‌వీధి, కుమ్మరి వీధులుతో పాటుగా పలు ప్రాంతాల్లో ఆయా స్థానిక పెద్దల ఆధ్వర్యంలో పలు చోట్ల భోగిమంటలు వేశారు.

శాస్త్రోక్తంగా అయ్యప్ప జ్యోతి దర్శనం



అయ్యప్పస్వామి సన్నిధిలో జ్యోతి దర్శనం



అయ్యప్పకు వెలంపల్లి ప్రత్యేక పూజలు

వన్‌టౌన్: అయ్యప్ప స్వామి వారి సన్నిధిలో జ్యోతి దర్శనం కార్యక్రమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాతబస్తీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లోని కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి సన్నిధిలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకారం అనంతరం ఆలయంపై భాగం నుంచి జ్యోతి దర్శనాన్ని అందించారు. అర్చకస్వాములు మురళీధరన్ నంబూద్రి స్వామికి కేరళ సంప్రదాయ రీతిలో విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇంద్రకీలాద్రి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో..

నెహ్రూబొమ్మ సెంటర్‌లో దుర్గాశి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించారు. అదే సమయంలో ఇంద్రకీలాద్రిపైన ఉన్న అయ్యప్ప స్వామి సన్నిధిలో జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ 51వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మరుపిళ్ల రాజేష్, దుర్గాశి కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవాలు



వెంకన్న సన్నిధిలో గోదాదేవి కల్యాం



కొత్తగుళ్లు కోదండరాముని సన్నిధిలో వేణుగోపాలుని కల్యాణోత్సవం



పాండురంగడి కల్యాణోత్సవం



గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నిత్యం తిరుప్పావై పఠనంతో పాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని సాయంత్రం ఆలయ ప్రాంగణలోని కల్యాణవేదికపై గోదాదేవిరంగనాథుల కలాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్ బాబు పర్యవేక్షించారు.

పాండురంగని కల్యాణం

కొత్తగుళ్ల ప్రాంగణంలోని పాండురంగస్వామి సన్నిధిలో రుక్మాబాయి సమేత పాండురంగని కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

కోదండరామాలయంలో..

కొత్తగుళ్ల ప్రాంగణంలోని కోదండరామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు నిర్వహించారు.

నగరాల రామాలయంలో..

కొత్తపేట కోమలవిలాలస్ సెంటర్ సమీపంలోని నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో భోగి పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కమనీయం గోదా రంగనాథుల కల్యాణం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం రంగనాథ సమేత గోదాకల్యాణ కార్యక్రమాన్ని అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవారి సేవాదళ్ కార్యకర్తలు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

లబ్బీపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణం శాస్త్రీయంగా నిర్వహించారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్ర సముదాయంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహించారు.

చల్లంరాజు సత్రం అభివృద్ధికి కృషి చేస్తా



పేదలకు చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని చల్లంరాజు వెంకటశేషయ్య ధర్మ సత్రం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సత్రం వ్యవస్థాపకురాలు తుమ్మలపల్లి దుర్గమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని సత్రం ప్రాంగణంలో అధికారులు, పాలకవర్గం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం, అనాథలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ దాతల ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. నూతన పాలకవర్గం సత్రం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్ యలకల చలపతిరావు, సత్రం పాలకవర్గ అధ్యక్షుడు వాసాబాబు, సభ్యులు నాగపావని, రుద్ర శంకర్, దుర్గాప్రసాద్, లక్ష్మీకుమారి, సుగుణ, అశోక్ పాల్గొన్నారు.

గ్రైండర్ అందజేత



గ్రైండర్ అందజేస్తున్న గుడ్ సమరిటన్ ట్రస్ట్ సభ్యులు

ఇబ్రహీంపట్నం : గుడ్ సమరిటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ్ నికేతన్ (దివ్యాంగుల సేవాసంస్థ)కు గ్రైండర్‌ను శనివారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చిట్టేలు కోటేశ్వరరావు సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యురాలు శశి జన్మదిన వేడుకలు దివ్యాంగుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. వారికి కేక్‌లు, స్వీట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ట్రస్ట్ కార్యదర్శి వేల్పుల రాజేష్, సభ్యులు హరీష్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళిలో భగవంతుడిని చూసుకోవాలి



తిరుప్పావై అంశంగా ప్రసంగిస్తున్న నరసింహాచార్యులు

విజయవాడ కల్చరల్: సర్వమానవకోటిలోనూ భగవంతుడిని చూసుకోవాలని అదే మహర్షులు మనకు అందించిన దివ్యసందేశమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నరసింహాచార్యులు ఉపదేశించారు. శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు శనివారం ముగిశాయి. నరసింహాచార్యులు మాట్లాడుతూ శివ కేశవులకు భేదం లేని మాసం ధనుర్మాసమని వివరించారు. గోదాదేవి రంగనాథుని ప్రసన్నం చేసుకోవడానికి పాశురాలను రచించి గానం చేసిందన్నారు. పాశురాలను తిరుప్పావైగా కూడా సంభాషిస్తారన్నారు. వాటి పఠనం శ్రవణం ముక్తికి మార్గంగా భావిస్తారన్నారు. నెల రోజులపాటు ధనుర్మాసం సందర్భంగా భగవత్ కైంకర్యంలో పాల్గొన్న అర్చక స్వాములను భక్తులు ఆత్మీయంగా సత్కరించారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

జమ్మవరం(వీరులపాడు): మండలంలోని జమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలకు మంచి స్పందన వస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా శాంతి కల్యాణోత్సవం



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేం చేసి ఉన్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలోని దత్తత ఆలయం చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి శాంతి కల్యాణోత్సవం జరిపారు. లోక కల్యాణార్థం శాంతి కళ్యాణం సంప్రదాయంగా నిర్వహించామని తెలిపారు. స్వామి వారికి కేసీపీ తరపున ప్రతినిధి ప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలు శాంతియుతంగా నిర్వహించాలి



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వాహకులు శాంతియుతంగా నిర్వహించాలని సీఐ నాగమురళి పేర్కొన్నారు. గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ, ముగ్గుల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. అంతేకాకుండా నిర్వాహకులు కూడా ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా క్రీడలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో కొద్దిసేపు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నబాబు, నిర్వాహకులు సోమోజు నాగమణి, దంతాల వెంకటేశ్వర్లు, లింగారావు తదితరులు పాల్గొన్నారు.